క్లుప్తంగా

వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మానకొండూరు: మండలంలోని గంగిపల్లి కి చెందిన ములకల స్వర్ణలత పక్షవాతంతో బాధ పడుతోంది. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకుడు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ సూచన మేరకు ఆదివారం ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ ఆమెకు వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో జీడీ వెంకటస్వామి, దుబాసి ప్రదీప్, నెరవేణి బాలయ్యయాదవ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కరుణాకర్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ బింగి కరుణాకర్ ప్రారంభించారు. ఎంపీ నిధులతో చేపట్టిన పనులు రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి రమేష్, ఉపసర్పంచ్ హంసరెడ్డి, వార్డు మెంబర్లు తిరుపతి, దేవయ్య, వార్డు ప్రజలు బొడ్డు ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ గురుకుల విద్యాలయ పూర్వ విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆదివారం రూ. 25 వేల ఆర్థిక సాయం చేశారు. 2007లో పదో తరగతి పూర్తి చేసిన కొళ్లపల్లి సురేశ్ ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించి మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొత్తూరి మహేశ్, ఏవైఎస్ పట్టణ అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్, భక్తు విజయ్‌కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్, కోలపురి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుట్టు శిక్షణ



సర్టిఫికేట్లు పొందిన మహిళలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లిలో దేశపాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్ బాక్స్ సహకారంతో 30 రోజులు కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చారు. ఆదివారం శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళలు స్వయం ఉపాధితో పురోగతి సాధించాలన్నారు. అనంతరం శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పౌండేషన్ నిర్వాహకులు, ప్రోగ్రాం మేనేజర్ రమేశ్, భాస్కర్, మునేశ్, ట్రైనర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో ఆదివారం సీఐ బొల్లం రమేశ్ బ్లూకోల్ట్స్ సిబ్బందికి జాకెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పట్టణం, మండలంలో పటిష్ట నిఘాతో అక్రమాలను అరికట్టేందుకు సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.ఎస్ఐ రాజన్న,తదితరులున్నారు.

సబ్సిడీపై ట్రాక్టర్లు మంజూరు చేయాలి

సైదాపూర్: ఐదెకరాలున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ట్రాక్టర్లను మంజూరు చేయాలని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. సీజన్‌లో ట్రాక్టర్ల కొరత ఉంటుందని, రైతులందరికి ఒకేసారి ట్రాక్టర్ల అవసరం ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అవసరమున్న రై తులకు ట్రాక్టర్లు మంజూరు చేయాలని కోరారు.



తిమ్మాపూర్: సమ్మేళనంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



జమ్మికుంట పట్టణంలో..



తిమ్మాపూర్: ఎల్ఎండీ కాలనీ సెయింట్ ఆంటోనీ విద్యార్థులు, ఉపాధ్యాయులు



మానకొండూర్ మండలం కొండపల్కల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

మానకొండూర్/తిమ్మాపూర్/జమ్మికుంట: మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల 1985, కొండపల్కల ఉన్నత పాఠశాల 1983, తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల 1990, సెయింట్ ఆంటోనీ 2008 పదో తరగతి విద్యార్థులు, జమ్మికుంట పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1981 ఎస్ఎస్‌సీ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని నిర్ణయించారు. మృతి చెందిన ఉపాధ్యాయులు, స్నేహితులకు నివాళి అర్పించారు. సాయంత్రం వరకు ఎవరెవరు ఏయే ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులు చేస్తున్నారో తెలుసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.



మానకొండూర్ మండల కేంద్రంలో పూర్వ విద్యార్థులు

నాడు కళకళ.. నేడు విలవిల

- ప్రమాదం అంచున ప్రభుత్వ పాఠశాలలు
- విద్యార్థులు లేక మూసివేత
- జమ్మికుంట, ఇల్లందకుంట,వీణవంక మండలాలకు ఏళ్లుగా ఒకే ఇన్‌చార్జి ఎంఈవో



ఒక టీచర్ ముగ్గురు విద్యార్థులున్న వాగొడ్డు రామన్నపల్లి బడి



విద్యార్థులు లేకపోవడంతో మూతపడ్డ భోగంపాడు పాఠశాల



మల్యాలలో శిథిలమైన స్కూల్



మనఊరు మనబడిలో శ్రీరాములపల్లి పాఠశాలకు కొత్త హంగులు

ఇల్లందకుంట: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతీ తరగతి గది విద్యార్థులతో కళకళలాడేది. కానీ మౌలిక వసతులు కరువై పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేక ఏటా పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గడంతో నేడు వెలవెల బోతున్నాయి. ఇల్లందకుంట, సిరిసేడు, హైస్కూల్స్, మల్యాల ప్రాథమిక, శ్రీరాములపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలు మినహా మిగతా గ్రామాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మరో వైపు బోధించేవారు లేక కంప్యూటర్స్ మూలనపడ్డాయి. ఇప్పటికే భోగంపాడు,ఆవాల రామయ్యపల్లి పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడ్డాయి. భవిష్యత్‌లో ఇంకా కొన్ని బడులు మూతపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే సర్కార్ స్కూళ్లకు ప్రమాదం పొంచి ఉంది.

- మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో 29 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.
- హైస్కూళ్లు 7, ప్రైమరీ స్కూళ్లు 15, లోయర్ ప్రైమరీ స్కూళ్లు 5, కేజీబీబీ 1, మోడల్ స్కూల్ 1 ఉన్నాయి.
- విద్యార్థులు బాలురు 803, బాలికలు 839 మొత్తం 1642 మంది ఉన్నారు.
- ఉపాధ్యాయులు 117, ప్రస్తుతం 99మంది ఉన్నారు. మిగిలిన 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- సరిపడా తరగతులు లేక మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి.
- రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక కొన్ని పాఠశాలలు మూతపడ్డాయి. విద్యార్థులు లేని స్కూళ్ల నుంచి టీచర్లను ఇతర పాఠశాలలకు బదిలీ చేశారు.
- టేకుర్తి గ్రామపంచాయతీ పరిధిలోని ఆవాల రామయ్యపల్లి పాఠశాలలో ఒక విద్యార్థికి ఒకే టీచర్ ఉండగా టేకుర్తి బడికి పంపించారు.
- వాగొడ్డురామన్నపల్లి ఒక టీచరు ముగ్గురు విద్యార్థులు. పిల్లలు రాని రోజు టీచర్ సాయంత్రం వరకు ఉండి వెళ్లిన సందర్భాలున్నాయి.
- పదేళ్లుగా పదిమందికి మించి పిల్లలు ఉండకపోవడం విశేషం.
- కనగర్తి ఎస్సీ కాలనీ బడిలో తొమ్మిది మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. మల్యాల హైస్కూల్‌లో 35మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు. టెన్త్ క్లాస్‌లో జీరో అడ్మిషన్. కనగర్తి హైస్కూల్‌లో మొత్తం 17మంది విదార్థులున్నారు.
- కొన్నేళ్ల నుంచి ఇదే తంతు కొనసాగుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించడంలో అధికారులు, ఉపాధ్యాయులు విఫలమవుతున్నారు. తూతూ మంత్రంగా బడిబాట చేపడుతున్నారు.
- ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం లక్షలు వ్యయం చేస్తున్న వృథా అవుతోంది. సర్కార్ బడి అనే చిన్నచూపు పోవాలి. లక్షలు పెట్టి ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు కానీ ప్రభుత్వ బడులకు పంపించాలంటే ఆలోచిస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన మనఊరు మనబడి పనులు

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం మనఊరు మనబడి కార్యక్రమం చేపట్టింది. మండలంలోని మొత్తం తొమ్మిది స్కూళ్లను మనఊరు మనబడి కార్యక్రమంలో ఎంపిక చేసి మరమ్మతులు, మౌలిక సదుపాయలను కల్పించాలని అధికారులు గుర్తించారు. మల్యాల ప్రాథమిక, శ్రీరాములపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ స్కూళ్లగా ఎంపిక చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దాదాపు తొంబై శాతం పనులు పూర్తయ్యాయి.

మౌలిక వసతులు కల్పించాలి



విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్నారు. ఎన్నో ఏళ్లుగా రెగ్యులర్ ఎంఈవోతో పాటు ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న మిగతా పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవాలి, ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

– ఎండీ.ఇమ్రాన్, ఎస్ఎస్‌యూఐ జిల్లా జనరల్ సెక్రటరీ

ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా..



ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా కార్పొరేట్ స్థాయిలో వసతులు, విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులకు నివేదిక అందజేశాం. బడిబాట ప్రోగ్రాం ద్వారా పూర్తిస్థాయిలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరానికి వందశాతం ఫలితాలు సాధిస్తాం. మన ఊరు – మనబడి కార్యక్రమం పనులు తొంభైశాతం పూర్తయ్యాయి.

– విడపు శ్రీనివాస్, ఇన్‌చార్జి మండల విద్యాధికారి

నిధుల మంజూరుపై నాయకుల హర్షం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

రామడుగు: మండలంలోని గుండి చెరువు మత్తడి వద్ద వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.20 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. ఆదివారం బూరుగుపల్లి క్యాంపు కార్యాలయంలో ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మడ్డి శ్యాంసుందర్‌గౌడ్, వంచ మహేందర్‌రెడ్డి, నాయకులు కలిగేటి లక్ష్మణ్, ఎడవెల్లి పాపిరెడ్డి, పూదూరి మల్లేశం, కనకయ్య, రాజశేఖర్ నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

నియామకం కమిటీలు

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామారావు



నియామకపత్రం అందిస్తున్న ఆర్. కృష్ణయ్య

ఇల్లందకుంట: హుజూరాబాద్ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జిగా మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఇంగిలే రామారావును జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జు సత్యం నియమించారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా రామారావు నియామకపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం, సంక్షేమమే లక్ష్యంగా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గాదె గుణసాగర్, శివ,కిరణ్, పరమేశ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం ఎన్నికలు



శాలువాతో సత్కారిస్తున్న సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పంజాల తిరుపతి, సెక్రెటరీగా చిలుకమారి శ్రీనివాస్, కోశాధికారి చింద్యాల కమల్‌సింగ్ గెలుపొందారు. అనంతరం గెలుపొందిన వారిని శాలువాతో సత్కారించి స్వీట్లు పంపిణీ చేశారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా సుగుణాకర్‌రెడ్డి



సుగుణాకర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామం రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఎడమ సుగుణాకర్‌రెడ్డిని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎడమ గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎడమ మనోహర్‌రెడ్డి, కోశాధికారిగా మాడుగుల శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎడవెల్లి రాఘవేందర్‌రెడ్డి, మాడుగుల రత్నాకర్‌రెడ్డి, హన్మాండ్ల జనార్దన్‌రెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికలు ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానించారు.

బిజిగిరిషరీఫ్ దర్గా అధ్యక్షుడిగా మహమ్మద్ ఇక్బాల్



శుభాకాంక్షలు తెలుపుతున్న ముజావర్లు

జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గా అధ్యక్షుడిగా మహమ్మద్ ఇక్బాల్ ఎన్నికయ్యారని దర్గా ముత్తవల్లి అక్బర్ అలీ తెలిపారు. ఆదివారం దర్గాలోని గెస్ట్ హౌజ్‌లో ఎన్నికలు నిర్వహించారు. దర్గా ముజవర్లు మహమ్మద్ ఇక్బాల్, అన్వర్ హుస్సేన్, చాంద్‌పాషా అధ్యక్ష పదవి పోటీలో పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని అక్బర్ అలీ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ... దర్గా అభివృద్ధికి పాటుపడుతానని, భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పిస్తానన్నారు. రెండోసారి గెలుపుకోసం కృషి చేసిన ముజావర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌పార్టీ కార్యవర్గం ఎన్నిక

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి, గునుకులపల్లె గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ గ్రామశాఖ ఎన్నికలు నిర్వహించారు. ఇందుర్తి గ్రామశాఖ అధ్యక్షుడిగా చింతపూల నరేందర్, ఉపాధ్యక్షుడిగా మంద లక్ష్మణ్, కార్యదర్శిగా బురికి రాజయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా బుర్ర లక్ష్మణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అందె బాయికాడి బాబు, కిసాన్, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా చింతపూల సాయన్న, ఎస్‌కె చాన్‌పాషా, ఎన్నికయ్యారని పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి తెలిపారు. గునుకులపల్లె గ్రామశాఖ అధ్యక్షుడిగా కూనచ్చుల బాలయ్య, ఉపాధ్యక్షుడిగా చిట్యాల బాల్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిట్యాల తిరుమల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గునుకుల మహేందర్‌రెడ్డి ఏకగ్రావంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో అందె సురేశ్, ఠాకూర్ నరేందర్‌సింగ్, కాంతాల మహిపాల్‌రెడ్డి, బుర్ర శివలీల, ఆర్ఎంపీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

వెదిర గ్రామ కాంగ్రెస్ కమిటీ

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ కాంగ్రెస్ కమిటీని ఆదివారం కార్యకర్తలు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడిచెల్మల అంజనేయులు, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా రాల్లబండి వెంకట్‌రెడ్డి, ఓసీ సెల్ అధ్యక్షుడిగా కోరుకండ్లపల్లి లచ్చిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉప్పు వీరయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ షాబుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గుడిసె ఈదయ్య, అసంఘటిత కార్మిక సెల్ అధ్యక్షుడిగా మీసాల వెంకటయ్య, గ్రామ సమన్వయకర్తగా ఆరెపల్లి రామస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్‌గా వెన్న రాజమల్లయ్య, డీసీసీ కోఆర్డినేటర్ వి.అంజన్‌కుమార్, నాయకులు తిరుపతి, కాడె శంకర్,బాలాగౌడ్, బాషు, చంద్రశేఖర్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.



కనుల పండువగా సహస్ర దీపాలంకరణ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేశారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుతో భూస్వాములకే లబ్ధి

కరీంనగర్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధుతో భూస్వాములకే లబ్ధి చేకూరుతోందని బీజేపీ వెస్ట్ జోన్ కిసాన్ మోర్చా ఇన్‌చార్జి కాల్వ పూర్ణచందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రేకుర్తిలో నిర్వహించిన బీజేపీ కిసాన్ మోర్చా వెస్ట్ జోన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. పీఎం సమ్మాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఐదు ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు సంవత్సరానికి రూ.6వేలు తమ ఖాతాల్లో జమ చేస్తున్నారని, రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులను అందిస్తున్నారని తెలిపారు. రైతుబంధు ద్వారా ఎకరం మొదలు పరిమితి లేని భూమి పథకం అమలు లో ధనవంతులు లబ్ధి పొందుతున్నారని అన్నారు.

పరామర్శ

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రాచకొండ వీరస్వామిగౌడ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి కింద పడగా గాయాలపాలయ్యాడు. ఆదివారం సర్వాయి పాపన్న మోకు దెబ్బగౌడ సంక్షేమ సంఘం నాయకులు ఆయనను పరామర్శించారు. వైద్య ఖర్చులకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శారద, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ తదితరులున్నారు.

బియ్యం అందజేత

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన కొర్వి అజయ్‌సంధ్యకు యాభై కిలోల బియ్యం యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో అందించామన్నారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, ముస్కు ఉపేందర్‌రెడ్డి, చింతల శ్రీధర్‌రెడ్డి, మార్గం మల్లేశం, మాడుగుల స్వామిరెడ్డి, వడ్డే శ్రీకాంత్‌రెడ్డి, ముదిగంటి మహిపాల్‌రెడ్డి, క్లోం మల్లారెడ్డి, రాములు పాల్గొన్నారు.

సాగర్ పునీత్‌లో ఎన్‌సీసీ కెడెట్లు



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ కెడెట్లు ఆదివారం సాగర్ పునీత్ కార్యక్రమం నిర్వహించారు. తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ పరిసరాలలో గడ్డిని, చెత్తను, ప్లాస్టిక్, వ్యర్థాలను శుభ్రం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ స్వచ్ఛ ప్రకృతి లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డా. కె రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.